సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



పైసలిస్తేనే ఆపరేషన్లు

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కు.ని. ఆపరేషన్లు చేయించుకోవాలంటే సిబ్బంది చేయి తడపాల్సిందేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 8లో



టీడీపీ నేతల అడ్డాగా ఫెర్రీ

అబ్బిరాజుపాలెంలో గోదావరిలో పడవ ప్రయాణానికి అనుమతి లేకపోయినా టీడీపీ నాయకులు దౌర్జన్యంగా పడవలు నడుపుతున్నారు. 8లో



కూటమిలో డిష్యూం.. డిష్యూం

అజ్జమూరులో జనార్దనస్వామి దేవస్థానం నూతన కమిటీ విషయంలో కూటమి నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. 8లో

చెత్తశుద్ధి కరువు

ఇదేనా స్వచ్ఛాంధ్ర ?

- సహకారం అందించని సర్కారు
- సిబ్బంది కొరత, పర్యవేక్షణ లేక నిరుపయోగంగా సంపద కేంద్రాలు
- రోడ్ల పక్కనే చెత్తకుప్పలు
- కనిపించకుండా గ్రీన్ మ్యాట్‌లు
- చెత్తాచెదారంతో పూడుకుపోతున్న కాలువలు
- జిల్లాలో 409 పంచాయతీలు

హెచ్చరిక.. అంటూ ఏర్పాటుచేసిన ఈ చిత్రాన్ని చూశారా? ఏపీ పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 193 ప్రకారం ఇక్కడ చెత్తవేస్తే జరిమానా విధిస్తామంటూ భీమవరం–తాడేపల్లిగూడెం రోడ్డులోని గొల్లల కోడేరు మెయిన్ చానల్ గట్టుపై కనిపించిన దృశ్యమిది. స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర పేరిట పంచాయతీ అధికారులు ఇక్కడ నోటీస్ బోర్డు ఏర్పాటుచేయగా షరా మామూలుగానే స్థానికులు ఇక్కడే చెత్త వేస్తున్నారు.



తాడేపల్లిగూడెం రోడ్డులోని గొల్లలకోడేరులో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు వద్ద చెత్త

సాక్షి, భీమవరం: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కేవలం హెచ్చరిక బోర్డులు, పాలకులు, అధికారుల ప్రచార ఆర్భాటానికే పరిమితమవుతోంది. క్షేత్రస్థాయిలో ఆ జాడే కనిపించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 409 పంచాయతీలకు 70 శాతానికి పైగా గ్రామాలకు డంపింగ్ యార్డులు లేవు. సమస్య పరిష్కారంతో పాటు పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీకి నిర్ణయించారు. జిల్లాలోని దాదాపు అన్ని పంచాయతీల్లో గతంలోనే బృందావనాలు నిర్మించారు.

ప్రచార ఆర్భాటంగా స్వచ్ఛ భారత్

అక్టోబర్ 2 తర్వాత నుంచి రాష్ట్రమంతటా ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్టు తణుకు పర్యటనలో సీఎం చంద్రబాబు చెప్పారు. ప్రతినెలా 4వ శనివారం ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు పిలుపునిచ్చారు. కాగా అందుకు అవసరమైన సిబ్బంది నియామకానికి, సామగ్రి సరఫరాకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టడం లేదు. ఇంటింటా చెత్త సేకరణ కోసం 200 కుటుంబాలకు ఒక గ్రీన్ అంబాసిడర్ ఉండాల్సి ఉండాలి. కొన్ని పంచాయతీల్లో సగం మంది కూడా లేని పరిస్థితి. ఆర్థిక సంఘం నుంచి రూ.6,000, జనరల్ ఫండ్స్ నుంచి రూ.4,000 కలిపి రూ.10 వేలు జీతంపై గ్రీన్ అంబాసిడర్‌ను నియామకం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కాగా జనరల్ ఫండ్స్ లేక సిబ్బంది నియామకం చేసుకోలేని పంచాయతీలు ఎన్నో.

కానరాని చెత్తశుద్ధి

తడిచెత్త నుంచి వర్మీకంపోస్టు తయారుచేసి దానిని విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయం సమకూర్చుకోవాలి. పొడిచెత్తను రీసైక్లింగ్‌కు ఇవ్వడం ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ చేయాలి. సిబ్బంది కొరత, పర్యవేక్షణ లోపంతో చెత్త నుంచి సంపద తయారీ ప్రకటనలకే పరిమితమవుతోంది. జిల్లాలోని చాలా పంచాయతీల్లో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి.

ఎక్కడపడితే అక్కడే చెత్త

డంపింగ్ యార్డులు లేకపోవడం, బృందావనాలు వినియోగానికి నోచుకోక గ్రామాల్లో సేకరించిన చెత్తను కాలువ గట్లు, రోడ్లు పక్కన ఎక్కడపడితే అక్కడే డంప్ చేస్తున్నారు. గట్లుపై వేసిన చెత్త కాలువల్లోకి చేరి నీటి కాలుష్యంతో పాటు పూడుకు పోయి సాగు, మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. రోడ్ల పక్కన చెత్తకుప్పలతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు అగచాట్లు పడాల్సి వస్తోంది. కొన్ని పంచాయతీల్లో రోడ్లు పక్కన వేసిన చెత్త కనిపించకుండా గ్రీన్ మ్యాట్‌లు కట్టి కవర్ చేస్తున్నారు. అయితే దారిని వెళ్లే ప్రయాణికులకు దుర్గంధం షరామామూలే అవుతుంది. స్వచ్ఛ భారత్ అంటూ హడావుడి చేస్తున్న ప్రభుత్వం అందుకు అవసరమైన తోడ్పాటు అందించక పోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామ కార్యదర్శులు అంటున్నారు.



పెనుగొండలోని నక్కల డ్రెయిన్ దుస్థితిని గమనించారా? జిల్లాలోని 13 మేజర్ డ్రెయిన్లలో ఇదీ ఒకటి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గం నుంచి మొదలై పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాల మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. గ్రామంలో సేకరించిన చెత్త మొత్తాన్ని ఈ డ్రెయిన్ గట్టుపై డంప్ చేయిస్తున్నారు. డ్రెయిన్ వెంబడి ఉన్న గ్రామాల్లో ఇదే పరిస్థితి. ఈ చెత్త కిందికి జారిపోతూ డ్రెయిన్ చాలాచోట్ల సగానికిపైగా మూసుకుపోయింది. అధిక వర్షాలు కురిసినప్పుడు నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పొలాలు ముంపుబారిన పడటానికి కారణమవుతోంది.



మార్టేరు–అత్తిలి రోడ్డులోని అలమూరు–భట్లమగుటూరు వద్ద పరిస్థితి ఇది. సంపద తయారీ కేంద్రం నిరుపయోగంగా ఉండగా చెత్త అంతటిని రోడ్డు పక్కనే వేస్తున్నారు. దారిన వెళ్లే వారికి అది కనిపించకుండా గ్రీన్ మ్యాట్‌ను అడ్డుగా పెట్టి కవర్ చేస్తున్నారు. అయితే చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తోంది. ఇవే కాదు జిల్లాలోని చాలా పంచాయతీల్లో ఇదే దుస్థితి.

న్యూస్‌రీల్

శాంతించిన గోదావరి



గోదావరిపై పంటు రాకపోకలు

నరసాపురం: నరసాపురంలో వశిష్ట గోదావరి శాంతించింది. నాలుగు రోజులుగా ఉధృతంగా ప్రవహించగా సోమవారం నీటిమట్టం భారీగా తగ్గింది. అలాగే వలంధర్‌రేవు, లలితాంబఘాట్, పడవలరేవు ప్రాంతాల్లో నీటిమట్టం సాధారణ స్థాయికి చేరింది. పడవలరేవులో ఐదు రోజులుగా నిలిచిపోయిన పంటు రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో పెద్ద ఎత్తున జనం పంటుపై రాకపోకలు సాగించారు. చించినాడ వంతెనపై మరమ్మతుల కారణంగా అటుగా వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో నరసాపురం నుంచి పంటుపై ప్రయాణాలు పెరిగాయి. దీంతో పంటు రేవు వద్ద రద్దీ పెరిగింది. రెండు పంట్లు తిప్పినా గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

భీమవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 13 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. అర్జీలు పునరావృతం కాకుండా గడువులోపు పరిష్కారం చూపాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కార్డులు అందిస్తున్న మంత్రి రామానాయుడు, కలెక్టర్ నాగరాణి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో నిరంతరాయంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందించేందుకు కృషి చేస్తున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో క్యూ ఆర్ కోడ్ స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీని కలెక్టర్ సీహెచ్ నాగరాణితో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లాలో 5.51 లక్షల కార్డులు పంపిణీ చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఆర్డీఓ దాసి రాజు, డీఎస్‌ఓ ఎస్.సరోజ, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్ల ధర్నా



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పెన్షనర్లు

భీమవరం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భీమవరం కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఆర్పీఏ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి గంగరాజు మాట్లాడుతూ కేంద్ర ఈపీఎఫ్‌లో దాదాపు 8 కోట్ల మంది పెన్షనర్లు ఉన్నారని వారిలో కేవలం కోటి మందికి కూడా పెన్షన్ ఇవ్వలేని దుస్థితిలో కేంద్రముందన్నారు. ఈపీఎఫ్ కేంద్ర సంస్థలో రూ.8 లక్షల కోట్లున్నా దానికి ఏటా రూ.54 వేల కోట్లు వడ్డీ రూపంలో వస్తున్నా పెన్షనర్స్‌కు మాత్రం రూ.14 వేల కోట్లు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. రాష్ట్రాలు చెల్లిస్తున్న సామాజిక ఫ్రెండ్‌షిప్ పెన్షన్ల కంటే కేంద్రం ఇస్తున్న పెన్షన్ చాలా తక్కువగా ఉందని గంగరాజు వాపోయారు. జిల్లా కార్యదర్శి వై.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17న విజయవాడలో ఏపీఆర్పీఏ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని, సదస్సులో వేలాది మంది పాల్గొంటారన్నారు. రాష్ట్ర సదస్సులో తమ హక్కుల సాధనకు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. చిరంజీవి, కె.సత్యనారాయణమూర్తి, కె.రాధాకృష్ణ, ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో తల్లికి వందనం పెండింగ్ క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వాహనాల ఆధార్ సీడింగ్, తల్లికి వందనం, వర్క్ ఫ్రం హోం, ఈకేవైసీ, కౌశలం డాష్ బోర్డు తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి ఖాతాల్లో సొమ్ములు జమచేయడానికి ఇబ్బందిగా ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేలో భాగంగా సాంకేతిక విద్య అభ్యసించిన యువతను గుర్తించి కౌశలం డాష్‌బోర్డులో అప్‌డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

కలెక్టరేట్‌ను తరలిస్తే సహించం

శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు



విలేకరులతో మాట్లాడుతున్న మోషేన్‌రాజు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గం నుంచి కలెక్టరేట్ తరలిపోతుందనే ప్రచారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు డిమాండ్ చేశారు. సోమవారం భీమవరంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పాలనా సౌలభ్యం కోసం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి పశ్చిమగోదావరి జిల్లాగా ఏర్పాటు చేయగా.. దానికి భీమవరం జిల్లా కేంద్రంగా ఏర్పడిందన్నారు. అందరికీ అందుబాటులో ఉండేలా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణానికి గునుపూడిలో ఏఎంసీ ఆవరణలో 20 ఎకరాల భూమి కేటాయింపు, భవనాల నిర్మాణానికి రూ.100 కోట్ల నిధులు మంజూరు జరిగిందన్నారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో జిల్లా కేంద్రాన్ని ఉండి నియోజకవర్గానికి తరలిస్తున్నారనే ప్రచారం జరుగుతోందని, దీనికి అనుగుణంగా ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు కాళ్ల మండలంలో కలెక్టరేట్ భవనాల నిర్మాణం శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబును ఆహ్వానించారనే ప్రచారం కూడా సాగుతోందని చెప్పారు. దీనికిగాను ఆక్రమణలు తొలగించిన ఇరిగేషన్ పోరంబోకు మూడున్నర ఎకరాల స్థలం కూడా కేటాయించినట్టు చెబుతున్నారని అన్నారు. ఇరిగేషన్ స్థలంలో ఇతర కట్టడాలు ఉండకూడదని, పేదల ఇళ్లు, ఇతర కట్టడాలను తొలగించి ఇప్పుడు ప్రభుత్వ భవనాలను ఎలా నిర్మిస్తారని మోషేన్‌రాజు ప్రశ్నించారు. అలాగే పీ–4 విధానంలో కలెక్టరేట్ భవనాలు నిర్మిస్తారని చెబుతున్నారని, ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పీ–4 ఎలా వర్తిస్తుందన్నారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న కలెక్టరేట్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని చూడటం ప్రాంతీయ విభేదాలను రెచ్చగొట్టేలా ఉందన్నారు. భీమవరం నుంచి కలెక్టరేట్‌ను తరలిస్తే ఊరుకునేది లేదని, దీనిపై ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా స్థానికంగా ఉంటున్న కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భీమవరం నుంచి కలెక్టరేట్ తరలిపోకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు సమాయత్తం కావాలని మండలి చైర్మన్ మోషేన్‌రాజు పిలుపునిచ్చారు.

28న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ–2025 అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈనెల 28న ఉదయం ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్టు డీఈఓ ఎం.వెంకట లక్ష్మమ్మ తెలిపారు. అభ్యర్థులు తమ లాగిన్‌కు వచ్చిన కాపీలను డౌన్‌లోడ్ చేసుకుని, సంబంధిత సర్టిఫికెట్లు, డీఎస్సీ హాల్‌టికెట్ కాపీ, ఆధార్ కార్డు, ఐదు పాస్‌పోర్టు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

పీజీఆర్‌ఎస్‌కు సమస్యల వెల్లువ



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి సమస్యలు వెల్లువెత్తాయి. జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను కలెక్టర్‌కు నివేదించారు. మొత్తం 248 అర్జీలు స్వీకరించినట్టు, ఆయా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- ఉండి మండలం చెరుకువాడకి చెందిన బొర్రా నరసింహమూర్తి తాను 15 ఏళ్లగా దివ్యాంగ పెన్షన్ పొందుతున్నానని, ఇటీవల రీ వెరిఫికేషన్ పేరుతో తన పెన్షన్ తీసివేస్తున్నట్టు నోటీసు ఇచ్చారని, న్యాయం చేయాలని కోరారు.
- పాలకొల్లు మనీ మార్కెట్‌లోని ఉన్న బార్‌కు రెండు వైపులా ఉన్న సీసీ రోడ్లు ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో వాహన రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతోందని, సమస్య పరిష్కరించాలని అర్జీ అందించారు.

గణపవరాన్ని కొనసాగించాలి



గణపరం మండలాన్ని యథాతథంగా పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని ఆ మండల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, ప్రజలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. మండలంలోని గ్రామాలు భీమవరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. అయితే పోలీసు శాఖకు సంబంధించి మండలం ఏలూరు పోలీసు జిల్లాలో ఉందని, దానిని కూడా పశ్చిమగోదావరి జిల్లాలోకి మార్చాలని కోరారు.

విద్యారంగంలో సమస్యలపై గళం



విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు రూ.6,400 కోట్లు విడుదల చేయాలని, హాస్టళ్లకు సొంత భవనాలు, మెస్ చార్జీలు రూ.3 వేల కోసం డిమాండ్ చేశారు. నరసాపురం ఆక్వా వర్సిటీకి శాశ్వత భవనాలు కల్పించాలని, జీఓ 77 రద్దు చేయాలని, షరతులు లేకుండా తల్లికి వందనం అందరికీ ఇవ్వాలని తదితర డిమాండ్లతో వినతిపత్రం సమర్పించారు.

పింఛన్ల తొలగింపుపై దివ్యాంగుల నిరసన



కూటమి ప్రభుత్వం పెన్షన్ల భారం తగ్గించుకోవడంలో భాగంగా ఏళ్ల తరబడి పెన్షన్ తీసుకుంటున్న దివ్యాంగుల పెన్షన్లు తొలగించడంపై నిరసన తెలిపారు. జిల్లాలోని దివ్యాంగుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో దివ్యాంగులు నాయకులు, పెన్షన్ తొలగింపు నోటీసులు అందుకున్న బాధితులు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి పీజీఆర్‌ఎస్‌లో తమకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

కుల ధ్రువీకరణ పత్రం మార్చారంటూ..



శెట్టి బలిజలకు రెవెన్యూ శాఖ జారీ చేసే క్యాస్ట్ సర్టిఫికెట్‌లో బీసీ–బీ గౌడ్ (శెట్టిబలిజ) అని వస్తుందని ఇది సరైందని కాదని జిల్లా శెట్టి బలిజ నాయకులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. గతంలో మాదిరిగా బీసీ–బీ శెట్టిబలిజ కింద సర్టిఫికెట్లు ఇవ్వాలంటూ నినదించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. శెట్టిబలిజ సంఘ నాయకులు పాలా రాంబాబు, కోడే యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు దారుణం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా తొలగించిన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలంటూ వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు బుడితి సుజన్‌కుమార్ కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను మనోవేదనకు గురి చేయడం తగదని, కార్యాలయాల చుట్టూ తిప్పడం దారుణమన్నారు. తక్షణమే దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మొగల్లులో మృతి చెందిన దుర్గారెడ్డి

పాలకోడేరు: అత్తిలి మండలం ఆరవల్లి గ్రామానికి చెందిన సత్తి దుర్గారెడ్డి(29)కి చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతి చెందడంతో తన మేనమామ సబిళ్ళ శ్రీనివాసరెడ్డి ఇంటి వద్ద ఉంటున్నాడు. గల్ఫ్ దేశం వెళ్లాలని కోరిక ఉన్నా.. ఆర్థిక ఇబ్బంది ఉండడంతో.. పాలకోడేరు మండలం మొగల్లులో రొయ్యల చెరువు వద్దకు వచ్చి శనివారం సాయంత్రం కలుపు మందు తాగి అపస్మారక స్థితి లోకి వెళ్లాడు. స్థానికులు స్పందించి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ వెంపటాపునకు పురస్కారం


విజయవాడలో ప్రశంసలు అందుకుంటున్న చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు

తణుకు అర్బన్: విజయవాడలోని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ కళాయజ్ఞ ఆధ్వర్యంలో శ్రామిక జీవన సౌందర్యం అంశంపై రాష్ట్ర స్థాయి చిత్రకళా ప్రదర్శనలో భాగంగా ఆదివారం నిర్వహించిన సెమినార్‌లో తణుకుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ వెంపటాపు చిత్రించిన ఉడ్ డిజైనర్ చిత్రం పలువురి ప్రశంసలు అందుకుంది. రాష్ట్రస్థాయిలో 40కి పైగా చిత్రకారులు పాల్గొని శ్రామికుల్ని వారి శ్రమని హృద్యంగా చిత్రాలుగా మలిచి ప్రదర్శించారని వెంపటాపు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పురస్కారం అందజేశారు.

కర్రలతో దాడి.. ఇద్దరికి గాయాలు

దెందులూరు: కొవ్వలి కొత్తపేట రామాలయం సమీపంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా రోడ్డుపై పందిరి వేయడానికి అభ్యంతరం చెప్పడంతో తనను, తన కొడుకును కర్రలతో కొట్టి గాయపరిచారని మాకిన పెద్దిరాజు, మాకిన నాగేంద్రబాబు తెలిపారు. పందిరి కొంచెం పక్కన వేయండి లేదా ఖాళీగా స్థలంలో వేయమని చెప్పడంతో ఆగ్రహించిన మాకా నందు, మాకా వంశీ కర్రలతో దాడి చేశారన్నారు. బాధితులకు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స అందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమవరం: భీమవరం ఒకటో పట్టణం తాడేరు రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై ఎస్.వి.వి.ఎస్ కృష్ణాజీ తెలిపారు. తాడేరుకు చెందిన ఎ.జగన్మోహనరావు(58) ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. రాత్రి 8.30 గంటలకు ఇంటికి వెళ్తుండగా ఇందిరమ్మకాలనీకి సమీపంలో గోవులు అడ్డురావడంతో ద్విచక్రవాహనంతో పక్కన ఉన్న వరి పొలంలో పడిపోయారు. ముఖం మట్టిలో కూరుకుపోవడంతో గాయాలై మృతి చెందాడని, అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పైసలిస్తేనే ఆపరేషన్లు

- తణుకు పీపీ యూనిట్‌లో నిర్వాకం
- కు.ని. ఆపరేషన్లకు రూ.500 నుంచి రూ.1000 ఇవ్వాల్సిందే


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పీపీ యూనిట్ విభాగం

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేయించుకోవాలంటే చేయి తడపాల్సిందే.. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన పీపీ యూనిట్ విభాగంలో నిర్వహిస్తున్న కుటుంబ నియంత్రణ (కు.ని.) శస్త్రచికిత్సల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయ. కు.ని. ఆపరేషన్ చేయాలంటే రూ.500 ఇవ్వాలని, ఆపరేషన్ చేయడానికి కొంచెం సమయం ఎక్కువైతే మరొక రూ.500 ఇవ్వాలని వైద్యసిబ్బంది డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. గత జూన్‌లో బదిలీపై వచ్చిన వైద్యురాలు తమ వైద్య సిబ్బంది ద్వారా ఈ తరహాలో డబ్బులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శస్త్రచికిత్సలు పూర్తయిన తరువాత వైద్యసిబ్బంది వచ్చి డబ్బులు వసూలు చేసి వైద్యురాలికి ఇస్తున్నట్లుగా బాధితులు చెబుతున్నారు.

మందులు అక్కడే కొనాలి..

పీపీ యూనిట్ విభాగంలో కుని శస్త్రచికిత్సకు వచ్చిన వారు సదరు వైద్యురాలి ప్రైవేటు ప్రాక్టీస్‌గా ఉన్న ఆస్పత్రిలోని మందుల దుకాణంలోనే మందులు కొనుగోలు చేయాల్సివస్తుందని బాధితులు చెబుతున్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఎదురుగా కూతవేటు దూరంలో ఉన్న ఒక ప్రైవేటు ఆస్పత్రిలోని మందుల దుకాణం నుంచి మందులు తీసుకువచ్చిన తరువాత శస్త్రచికిత్స చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. శస్త్రచికిత్సలకు వచ్చిన వారికి వైద్యురాలు తన ప్రైవేటు ఆస్పత్రి పేరుమీద ఉన్న విజిటింగ్ కార్డును ఇచ్చి అక్కడ మాత్రమే మందులు కొనుగోలు చేయాలని చెబుతుండడం విశేషం. ఏదైనా తేడా వస్తే ఏదోక కొర్రీలు వేసి డిశ్చార్జ్‌ను జాప్యం చేస్తారని బాధితులు వాపోతున్నారు.

కు.ని. శస్త్రచికిత్సలకు సంబంధించి కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్లక్ష్య ధోరణి కనబరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం జనాభా పెంచాలనే యోచనలో కుని శస్త్రచికిత్సలపై పట్టు వదిలేసిన దుస్థితి. గతంలో ప్రతి పీహెచ్‌సీలో కుని శస్త్రచికిత్సలు చేయాలంటూ వైద్యులకు టార్గెట్‌లు పెట్టి మరీ చేయించే పరిస్థితి ఉండేది. నేడు అలాంటి పరిస్థితి లేకపోవడంతో కొందరు వైద్యులు నిర్లక్ష్య ధోరణిని అవలంభిస్తూ ఇదే అదనుగా అవినీతి మార్గంలో అందినకాడికి దోచేసుకుంటున్నారని వైద్యసిబ్బంది సైతం చెబుతున్నారు. కొందరు వైద్యులు అవినీతికి పాల్పడుతున్నా, విధుల్లో అలసత్వం వహిస్తున్నా వైద్యారోగ్య శాఖ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఇలాంటి అవినీతి ఎన్నడూ లేదని వైద్యసేవలన్నీ పారదర్శకంగా జరిగేవని రోగులు చెబుతున్నారు.



వైద్య సిబ్బందికి రూ.500 ఫోన్ పే


ప్రైవేటు ఆస్పత్రిలో మందుల కొనుగోలు బిల్లు

రూ.1000 ఇచ్చాను

నా భార్యకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగంలోని వైద్యురాలిని సంప్రదించగా సోమవారం శస్త్రచికిత్స చేస్తామని రమ్మన్నారు. వచ్చిన తరువాత వైద్యురాలు మందులు చీటీ రాసి ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలోని మందుల దుకాణంలోనే మందులు కొనాలని చెప్పారు. వైద్యురాలి పేరుతోనే ఉన్న విజిటింగ్ కార్డు ఇచ్చారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యసిబ్బంది వచ్చి రూ.500 ఇమ్మంటే ఇచ్చాను. ఆ తరువాత ఆపరేషన్ సమయంలో మత్తు రెండోసారి ఇవ్వాల్సి వచ్చిందని.. మరో రూ. 500 ఇమ్మంటే వైద్యసిబ్బంది నెంబరుకు ఫోన్‌పే ద్వారా చెల్లించాను.

– అంజిబాబు, వేలివెన్ను, ఉండ్రాజవరం మండలం

కూటమిలో డిష్యూం.. డిష్యూం


అజ్జమూరు దేవస్థాన కమిటీ ప్రమాణస్వీకారంలో బీజేపీ నాయకుడిపై జనసేన ఇన్‌చార్జి ఆగ్రహం

రసాభాసగా అజ్జమూరు దేవస్థాన కమిటీ ప్రమాణస్వీకారం

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు జనార్దన స్వామి దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకారం రసాభాసగా ముగిసింది. దేవస్థాన కమిటీ చైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. చైర్మన్‌గా నాని, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో బీజేపీ మండల అధ్యక్షురాలు ముదునూరి నాగమణి అభ్యంతరం చెప్పారు. తమకు తెలియకుండా బోర్డును ఎన్నుకోవడం సమంజసం కాదన్నారు. నియామకంలో తమకు ఎందుకు ప్రాతినిధ్యం కల్పించలేదని నిలదీశారు. మరో బీజేపీ నాయకుడు వర్ధినేని లక్ష్మీ వర ప్రసాద్ మాట్లాడుతూ చైర్మన్ పదవిని రూ.3 లక్షలకు కొనుగోలు చేశారనే ఆరోపణలు గ్రామంలో వెల్లువెత్తుతున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాణం చేయడానికి తాను సిద్ధమని అన్నారు. హిందూ దేవాలయాల్లో అన్య మతస్తుల్ని నియమించకూడదన్న నిబంధన ఎందుకు పాటించలేదని ప్రసాద్ నిలదీశారు. మతం తీసుకున్న వ్యక్తులు హిందూ దేవాలయ కమిటీల్లో ఉండకూడదని పట్టుబట్టారు. దీనిపై చర్యలు తీసుకోకపోతే దేవాలయ శాఖ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తానని హెచ్చరించారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకదశలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు బీజేపీ నాయకుడు వర ప్రసాద్‌పై మండిపడ్డారు. ఇలాంటి వారిపై ఎందుకు చర్య తీసుకోరని బీజేపీ మండల అధ్యక్షురాల్ని ప్రశ్నించారు. తమకు తెలియకుండా బోర్డు వేయడం తప్పు కాదా! అని ఆమె ఎదురు ప్రశ్నవేశారు. ఇరు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం పెరగడంతో గ్రామ పెద్దలు కలుగజేసుకుని సర్దిచెప్పారు.

ఆక్వా ఎగుమతులపై ఆందోళన వద్దు

భీమవరం: ఆక్వా ఎగుమతులపై అమెరికా టారిఫ్‌ల కారణంగా రైతులకు ఎలాంటి నష్టం లేకుండా కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. సోమవారం భీమవరంలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ బీద మస్తాన్‌రావు, ఆక్వా రైతులు కలిసి ఆక్వా సమస్యలపై చర్చించారు. భారత్‌నుంచి ఎగుమతులు నిలిచిపోవడంతో అమెరికా దిగుమతిదారులు ఆందోళన చెందారని, రైతులు నష్టపోకుండా పెంచిన టారిఫ్‌ను వారే భరిస్తామని తెలిపారని మంత్రి చెప్పారు. రొయ్య రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల సుబ్బరాజు, పి.వెంకటేశ్వర రాజు, సీహెచ్ రామభద్రరాజు పాల్గొన్నారు.

టీడీపీ నేతల అడ్డాగా ఫెర్రీ

- అనుమతులు లేకుండా అబ్బిరాజుపాలెం రేవులో పడవలపై రాకపోకలు
- మంత్రి అండతోనే నడుపుతున్నామంటున్న నాయకులు
- తెలిసినా పట్టించుకోని అధికారులు


యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెం గోదావరి రేవులో తిరుగుతున్న పడవలు

యలమంచిలి: పశ్చిమ గోదావరి జిల్లా అబ్బిరాజుపాలెం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా సోంపల్లి గ్రామాల మధ్య గోదావరిలో పడవ ప్రయాణానికి అనుమతి లేకపోయిన టీడీపీ నాయకులు దౌర్జన్యంగా పడవలు నడుపుతున్నారు. అనధికారికంగా పడవలు తిప్పుతూ కనీస వసతులు కల్పించడం లేదు. సోమవారం ఒక పడవపై పదుల సంఖ్యలో మోటార్ సైకిల్స్ వేసి పడవ నడిపారు. పడవలో ఉన్న వారికి కనీసం లైఫ్ జాకెట్స్ ఇవ్వలేదు. దీనిపై ఇద్దరు ప్రయాణికులు అడిగిన పాపానికి వారిపై టీడీపీ నాయకుడు విచక్షణా రహితంగా దాడి చేశాడు. లైఫ్ జాకెట్స్ ఉండవు.. చస్తామనే భయముంటే పడవ ఎక్కకండి అంటూ వారిపై విరుచుకుపడ్డాడు. దీంతో ఆ ఇద్దరి యువకులు రాజోలు పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

వరదకు ముందు నుంచే..

ఒకవైపు గోదావరిలో వరద.. మరో వైపు మరమ్మతుల పేరిట చించినాడ వంతెనపై రాకపోకలకు ఆంక్షలు. దీంతో అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పడవ ప్రయాణాన్ని ఆశ్రయిస్తున్నారు. మండల పరిషత్ అధీనంలో ఉన్న దొడ్డిపట్ల ఫెర్రీకి మాత్రమే పంటు నడపడానికి అనుమతి ఉంది. పంచాయతీ అధీనంలో ఉన్న అబ్బిరాజుపాలెం ఫెర్రీకి రెండు నెలల క్రితమే ఫెర్రీ పాట గడువు ముగిసింది. ఇదే అదునుగా తెలుగుదేశం నాయకులు మంత్రి ద్వారా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి పాట పెట్టకుండా అనధికారికంగా ఈ ఫెర్రీలో పడవలు నడుపుతున్నారు. కనీస రక్షణ లేకుండా అధిక లోడు వేసి నడపడంపై ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

మంత్రి నడుపుకోమన్నారు

ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన గ్రామ సభలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులను గ్రామస్తులు ఫెర్రీ పాట పెట్టకుండా పడవలు ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. రేవులో నడుపుతున్న పడవలకు పంచాయతీకి సంబంధం లేదని సర్పంచ్, గ్రామ కార్యదర్శి చెప్పగా, అక్కడే ఉన్న తెలుగుదేశం నాయకులు మంత్రి నిమ్మల రామానాయుడు నడపమని చెప్పడంతో మేమే నడుపుతున్నాం అని చెప్పారు. మంత్రి పేరు చెప్పడంతో మిగిలిన వారు మిన్నకుండిపోయారు. వరద సమయంలో కనీస రక్షణ చర్యలు లేకుండా, అనుమతి లేకుండా ఫెర్రీలో పడవలు నడుపుతున్నా పంచాయతీరాజ్, రెవెన్యూ, కన్సర్వెన్సీ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక భారీగా ముడుపులు అందడమే కాకుండా మంత్రి ఒత్తిడి కూడా ఉందని గ్రామస్తులు గుసగుసలాడుతున్నారు.

అక్టోబరులో ఐఎఫ్‌టీయూ తరగతులు

ఏలూరు (టూటౌన్): ఐఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి రాజకీయ తరగతులను అక్టోబర్ నెలలో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. ఈ నెల 24, 25 తేదీలలో ఏలూరులో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి, ఇతర పండుగల నేపథ్యంలో వాయిదా వేశామన్నారు.

శ్రీవారికి బంగారు యజ్ఞోపవీతం బహూకరణ


శ్రీవారి దేవస్థానం ఈఓ సత్యనారాయణ మూర్తికి బంగారు యజ్ఞోపవీతాన్ని అందజేస్తున్న దాతలు


బంగారు యజ్ఞోపవీతం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారికి దాతలు సుమారు రూ.11 లక్షల విలువైన 106 గ్రాముల బంగారు యజ్ఞోపవీతాన్ని సోమవారం బహూకరించారు. భీమవరానికి చెందిన పిన్నమరాజు శ్రీనివాస రాజు, విజయవర్మ, భూపతిరాజు, శివరామరాజులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ బంగారు యజ్ఞోపవీతాన్ని ఆలయ కార్యాలయంలో దేవస్థానం ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తికి అందించారు. దీన్ని స్వామివారి సేవకు వినియోగించాలని దాతలు కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


పెనుమంట్ర పోలీస్ స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సు యాక్సిల్ రాడ్ విరిగి బయటకు వచ్చిన దృశ్యం

పెనుమంట్ర: భీమవరం ఆర్టీసీ డిపో బస్సు వెనుక టైరు యాక్సిల్ రాడ్ విరిగి బయటకు వచ్చింది. దీంతో బస్సు ఒకసారి ఒరిగిపోయింది. సోమవారం సాయంత్రం పెనుమంట్ర పోలీస్ స్టేషన్ సమీపంలో ఈ ఘటన జరిగింది. అయితే ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బస్సు రోడ్డు మధ్యలో నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

తాడేపల్లిగూడెం (టీఓసీ): హత్య కేసులో తాడేపల్లిగూడెం 11వ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేల జరిమానా విధించారు. రెండేళ్ల క్రితం ఈ హత్య జరిగింది. పట్టింపాలెంకు చెందిన శ్రీను, కుమారిలు సహజీవనం చేసేవారు. కుమారిపై అనుమానంతో తరుచుగా శ్రీను గొడవపడేవాడు. ఒక రోజు రాత్రి కుమారిని మంచం చెక్కతో బలంగా కొట్టగా ఆమె అక్కడికక్కడే చనిపోయింది. గ్రామ వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

పరిశోధనలతో వైజ్ఞానిక పురోగతి



నిట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో మాట్లాడుతున్న ఎఫ్ట్రానిక్స్ సీఈఓ దాసరి

తాడేపల్లిగూడెం: దేశ ప్రగతిలో టెక్నాలజీ ఎంతో కీలకపాత్ర పోషిస్తుందని, పరిశోధనల జోరుతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యమని ఎఫ్ట్రానిక్స్ ప్రైవేటు లిమిటెడ్ సీఈఓ దాసరి రామకృష్ణ అన్నారు. ఏపీ నిట్ ఇండక్షన్ ప్రోగ్రాంను పురస్కరించుకొని సోమవారం నిట్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు సమాజం ఎదుర్కొంటున్న కఠిన సవాళ్లకు ధీటుగా సమాధానం చెప్పాలంటే నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేయాలన్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ రమణరావు మాట్లాడుతూ కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్, రోబోటిక్స్ , ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్ వంటి కోర్సులపై పట్టు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్, అకడమిక్ కె.హిమబిందు, ఎన్.జయరాం, రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేక్‌లో బల్లిపై ఆందోళన

ముదినేపల్లి రూరల్: ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఆదేశాలు, సూచనలు బేఖాతరు చేస్తూ ఆహారపదార్థాల తయారీలో అశ్రద్ధ వహిస్తున్నారు. స్థానిక బేకరీలో తయారు చేసిన కేక్‌లో బల్లి రావడమే ఇందుకు నిదర్శనం. స్థానికుడు బేకరీలో కేక్‌ను కొనుగోలు చేయగా అందులో బల్లి అవశేషాలున్నట్లు గుర్తించి నిలదీశాడు. దీనిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుడ్‌సేఫ్టీ అధికారుల ఉదాసీనతత వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, వ్యాపారసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నత్తనడకన పంటల బీమా నమోదు

- వరి, ఉద్యాన పంటలు 40వేల ఎకరాలు
- 15 శాతం రైతులకు జమ కాని గత సీజన్ ఇన్‌పుట్ సబ్సిడీ
- నెలాఖరుతో ముగుస్తున్న పంటల బీమా గడువు



వరి చేను (ఫైల్)

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో పంటల బీమా నమోదు నత్తనడకన సాగుతుందని తెలుస్తోంది. వరి 25వేలు, ఉద్యాన పంటలు 13 నుంచి 15వేల ఎకరాల్లో సాగువుతుంది. మండలంలో మొత్తం 10వేల మంది రైతులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటి వరకు బ్యాంకుల నుంచి రుణాలు పొందని రైతులు రెండు వేల మంది మాత్రమే పంటల బీమా చేయించుకున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. దాదాపు ఎనిమిది వేల మంది రైతులు ఇప్పటి వరకు పంటల బీమా నమోదు చేసుకోలేదని తెలుస్తోంది. పంటల బీమా గడువు ఈ నెల 30వ తేదితో ముగుస్తోంది. అయితే, బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు ఎంత మంది బీమా చేయించుకున్నారనేది అంచనాలు లేవని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పలు చోట్ల వరి చేలలో నీరు నిలిచింది. దాదాపు 25 ఎకరాల్లో నీరు నిలిచిందని అధికారులు చెబుతున్నారు. మరికొన్ని రోజులు ఇలానే వర్షాలు కురిస్తే వరి చేలలో నీరు నిలిచి పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో ఆదిలోనే హంసపాదు అన్నట్టుగా రైతాంగా పరిస్థితి నెలకొంటుంది. ఇదిలా ఉంటే గత ఏడాది సార్వా సీజన్‌లో వీరంపాలెం, మాధవరం, జగన్నాథపురం, నందమూరు, ఆరుళ్ల, ఆరుగొలను, కొత్తూరు, కడియద్ద గ్రామాల్లో 2199 హెక్టార్లలో పంట నీట మునిగింది. 3,500 మంది రైతులకు దాదాపు రూ.3,73,00,095వేలు ఇన్‌పుట్ సబ్సిడీ జమ కావలసి ఉంది. ఇప్పటికే 85 శాతం మంది రైతుల ఖాతాలకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ అయిందని, మరో 15 శాతం అంటే 525మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ కావలసి ఉందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

ఇప్పటికే పలుమార్లు గడువు పెంపు

రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు పంటల బీమా నమోదు గడువు తేదిని మార్పు చేస్తూ వచ్చింది. తాజాగా ఈ నెల 30వ తేదివరకు గడువు పెంచింది. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులు చెల్లించవలసిన అవసరంలేకుండా బీమా చేయించింది. ప్రస్తుతం ఆ పరిస్థితిలేదు. దీంతో రైతులే ఎకరానికి రూ.210లు చెల్లించి బీమా చేయించుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో చాలామంది రైతులు పంటల బీమా నమోదు చేయించుకోలేదని తెలుస్తోంది. ఇప్పటి వరకు ఎంత మంది రైతులు బీమా చేయించుకున్నారనే లెక్కలు సైతం అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. పంటల బీమా నమోదు ఆలస్యమయ్యే కొద్ది రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా, త్వరితగతిన పంటల బీమా నమోదు ప్రక్రియను వేగిరపర్చవలసిన అవసరం ఎంతైనా ఉంది.

త్వరితగతిన నమోదు చేయించుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 30వ తేది వరకు పంటల బీమా గడువు పెంచింది. రైతులు ఆ గడువు లోపు పంటల బీమా చేయించుకోవాలి. తద్వారా భవిష్యత్ ప్రకృతి విపత్తుల వల్ల సంభవించే నష్టాన్ని భర్తీ చేసుకోవచ్చు.

– నారాయణరావు, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్

తణుకు అర్బన్: క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.గీతాబాయ్ అన్నారు. తణుకు ఎన్జీవో హోంలో సోమవారం ఎన్‌సీడీసీడీ 4.0 సర్వేలో భాగంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ఆస్పత్రుల్లో పరీక్షలు నిర్వహించుకొనేలా క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైదాధికారులకు శిక్షణనిచ్చారు. ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్‌లలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కేఎంఆర్ కిషోర్, పీఓ యూ నోడల్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, జిల్లా ఏపీ డెమోలాజిస్ట్ గాతల సుభాష్, డాక్టర్ మౌనిక, డాక్టర్ భారతి, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన సేకరణ శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు తెలిపారు. బ్రహ్మకుమారీ దాదీ ప్రకాశ్ మణి పుణ్యస్మృతి సందర్భంగా బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలోని జ్ఞాన ప్రకాశ భవనంలో సోమవారం నిర్వాహకురాలు బీకే రమాదేవి అధ్యక్షతన ఉచిత రక్తదాన శిబిరం జరిగింది. ఎన్‌టీఆర్ హెల్త్ ట్రస్ట్ వారిచే బ్లడ్ స్వీకరణకు సహకరించారు. పట్టణ ప్రముఖులు యెగ్గిన నాగబాబు, గౌర్రెల శ్రీధర్, గుండుమోగుల పద్మప్రియ, కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షుడు గట్టిం మాణిక్యాలరావు మాట్లాడారు. వక్తలు మాట్లాడుతూ బ్రహ్మకుమారీలు ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక సేవలలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీకే ఉదయ్ కిరణ్, సత్యనారాయణ బ్రహ్మకుమారీలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు అభినందనలు



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇటీవల అలంపురంలో జరిగిన ఏపీ రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ యోగా పోటీల్లో తాడేపల్లిగూడెం మండలంలోని మోదుగగుంట వ్యాయామ ఉపాధ్యాయులు బడుగు చంద్రశేఖర్ సుప్రైన్, ట్రెడిషనల్ విభాగాలలో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కట్టా జానకిరావు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు, యోగా సభ్యులు చంద్రశేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

నిడదవోలులో బీఓసీ సభను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దాన వర ప్రసాద్

తాడేపల్లిగూడెం (టీఓసీ): నిడదవోలులో సెప్టెంబర్ 14వ తేదీన బీఓసీ సభ జరుగుతుందని, సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మామిడి దాన వర ప్రసాద్ కోరారు. మండలంలోని జగన్నాథపురంలో సోమవారం బీఓసీ కార్మికుల సమావేశం జరిగింది. వరప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు బీఓసీ కార్మికులను ఆదుకుంటామని చెప్పారని, అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు కావస్తున్న ఇంతవరకు బీఓసీ బోర్డు నుంచి సింగిల్ పైసా కూడా కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో మంచాలు సత్తిపండు, నీలం సత్తిబాబు, సూర్యచంద్రరావు, దుర్గారావు, రాంబాబు, నాగేశ్వరరావు, బోసుబాబు, రామకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

నాలుగు బెంచీల ఏర్పాటు



హైవే బస్సు స్టాప్ వద్ద నాలుగు బెంచీలు ఏర్పాటు చేసిన సేవా సంఘం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీకృష్ణదేవరాయ సేవా సంఘం ఆధ్వర్యంలో నిట్ కళాశాల సమీపంలోని నేషనల్ హైవే బస్సు స్టాప్ వద్ద సోమవారం సంఘం గౌరవాధ్యక్షుడు నంద్యాల కృష్ణమూర్తి సౌజన్యంతో నాలుగు బెంచీలు ఏర్పాటు చేశారు. బెంగుళూరు, హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణీకులు ఎక్కువగా హైవే పై బస్సులు ఎక్కుతున్న కారణంగా వారు కూర్చునేందుకు వీలుగా బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అజ్జమూరులో రేషన్ షాపు ఏర్పాటు చేయండి

ఆకివీడు: మండలంలోని అజ్జమూరు గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామ శివారు గరువు ప్రాంతంలో రేషన్ ఇవ్వడం వల్ల రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 550కి పైగా రేషన్ కార్డులున్నాయని, వాటిలో 400 కార్డులు గ్రామంలోనే ఉన్నాయని, మిగిలినవి గ్రామ శివారు గరువు ప్రాంతంలో ఉన్నాయని చెబుతున్నారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తీసుకుని, మోసుకుని రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వస్తుందంటున్నారు.

గణపతి మట్టి ప్రతిమలనే పూజించండి



తణుకులో మట్టి వినాయక ప్రతిమలను అందచేసిన శ్రీనివాసురెడ్డి, భక్తులు



గణపతి వ్రత కల్ప పుస్తకాలను పంపిణీ చేస్తున్న కమిషనర్ ఏసుబాబు



భవిత సెంటర్‌లో గణపతి వేషధారితో భవిత సెంటర్ విద్యార్థులు



ప్రత్తిపాడులో గణపతి ప్రతిమల పంపిణీ



వినాయక మట్టి ప్రతిమలు అందజేత

తణుకు అర్బన్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం భక్తులంతా మట్టి వినాయక ప్రతిమలకు పూజాధికాలు నిర్వహించాలని యోగా గురువు, పతంజలి యోగా కల్చరల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్రి శ్రీనివాసురెడ్డి అన్నారు. తణుకు సూర్యాలయం వీధిలో సోమవారం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి రసాయనాలతో తయారు చేసిన ప్రతిమల కారణంగా నీటికాలుష్యం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జనసంఘం అధ్యక్షుడు కర్రి చంటిరెడ్డి, తమనంపూడి నాగిరెడ్డి, యోగాభ్యాసకులు మామూడూరి కృష్ణారావు, నెక్కంటి సత్యనారాయణ, రుత్తల సరోజిని, ఉద్దగిరి వెంకటేశ్వరరావు, రాజపురోహిత్ గోపాల్ సింఘ్, కోమట్లపల్లి పుల్లారావు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజించండి

తాడేపల్లిగూడెం: ప్లాస్టిక్ రహిత పదార్థాలతో తయారుచేసిన వినాయక విగ్రహాలను కాకుండా మట్టి గణపతి విగ్రహాలతో పూజలు చేయాలని మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు అన్నారు. సోమవారం మట్టి గణపతి ప్రతిమలను అందజేశారు. కార్యక్రమంలో టీపీఓ జగదీశ్వరరావు, ఎంహెచ్‌ఓ.ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతిని పూజిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతిని పూజిద్దామని భవిత సెంటర్ నిర్వాహకులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారిలు అన్నారు. భవిత దివ్యాంగుల సెంటర్‌లో పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా రంగుల ప్రతిమలు కారణంగా నీరు కలుషితం అవుతుందని చెప్పారు. మూగ జీవాలకు అనారోగ్యం వస్తుందని తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని, మట్టి ప్రతిమలనే వాడాలన్నారు. లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి సతీష్ చే మట్టి ప్రతిమలను విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అందజేశారు. మిఠాయిలు పంచారు.

ఉచితంగా మట్టి ప్రతిమలు పంపిణీ

పెంటపాడు: మండలంలోని అలంపురం గ్రామంలో స్థానిక సచివాలయం వద్ద ఉచితంగా వినాయక మట్టిప్రతిమలను సోమవారం పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు దాతలు పాల్గొన్నారు.

పేరిచర్ల ఫౌండేషన్ సేవలు మరువలేనివి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేరిచర్ల ఫౌండేషన్ నిర్వాహకులు మురళీకృష్ణంరాజు సేవలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక రామారావుపేటలో సోమవారం గణపతి మట్టి ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ పూర్వపు జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు మాట్లాడుతూ కాలుష్యరహిత విగ్రహాలను వాడితేనే పర్యవరణ పరిరక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. పదమూడు సంవత్సరాల నుంచి వినాయక ప్రతిమలు పంపిణీ అభినందనీయమన్నారు. క్లబ్ సభ్యులు మద్దుకూరి మెహర్ ప్రసాద్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా నాయకుడు జానకి రామరాజు, ఆర్ అండ్ బి వాకర్స్ సెక్రటరీ మానేపల్లి కిరణ్, చెన్నారెడ్డి సతీష్, కోటి విజయ్ కిషోర్, యర్రా ఆంజనేయ స్వామి, కన్నాజీ శ్రీనివాస్, రుద్రా శ్రీనివాస్, వినయ్, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

- మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- గూడెం మండలంలో జగ్గన్నపేటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ



జగ్గన్నపేట సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తానని సీఎం చంద్రబాబు ఊదరగొట్టారని, అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి కొట్టుసత్యనారాయణ అన్నారు. సోమవారం సాయంత్రం గూడెం మండలంలోని జగ్గన్నపేటలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన అందిస్తే చంద్రబాబు ప్రజలను మోసం చేసి పాలన కొనసాగిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసి పాలన సాగిస్తున్నారని, ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలో వ్యతిరేకత మొదలైందన్నారు. రానున్న రోజులలో కూటమికి ప్రజలే సరైన బుద్ధి చెబుతారన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరిస్తానని చెప్పి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చంద్రబాబు ఏం చెబితే దానికి తలూపడం సరికాదన్నారు. గత ప్రభుత్వంలో జగనన్న ప్రవేశపెట్టిన పలు పథకాలకు చంద్రబాబు తూట్లు పొడిచారన్నారు. ప్రతి కార్యకర్త వైఎస్సార్ సీపీ చేస్తున్న బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గడపగడపకూ తీసుకొని వెళ్లాలన్నారు. కూటమి మోసాలు ప్రజలకు తెలియజేయాలన్నారు. అదే విధంగా వైఎస్సార్ సీపీ పార్టీ పటిష్టతకు సైనికుడిలా పనిచేయాలనాన్నారు.

మద్యం పాలసీకి సూత్రదారి చంద్రబాబు

రాష్ట్రంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్య నిషేదం చేస్తామని చెప్పి జగనన్న కట్టుబడి ఉన్నారన్నారు. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా మద్యం దుకాణాలను ఏర్పాటుచేసి ఏపీ ప్రజల ఆరోగ్యాన్ని అపహరిస్తున్నారు. ప్రజల వ్యసనాన్ని ఆసరాగా చేసుకొని సిండికేట్ అయ్యి ఎంఆర్‌పీ ధరల కన్నా అధిక ధరలకు మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు భారీ ప్రజాదరణ లభిస్తుండటంతో కూటమి నాయకులు చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. ముందుగా గ్రామంలో పత్సా అంజిబాబు స్వగృహం వద్ద పలు గ్రామాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు జడ్డు హరిబాబు, వెలిచేటి నరేంద్ర, బండారు నాగు, ములకాల రాంబాబు, పత్సా అంజిబాబు, ములకాల ప్రసాద్, ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి బాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, బొద్దాని శ్రీనివాస్, కల్లేపల్లి కృష్ణంరాజు, కొలుపూరి ఉదయ్ భాస్కర్, బొల్లం నాగసుబ్బరాజు, బొర్రే అంజిబాబు, కూనపాముల కార్తీక్, కాసా వినాయక్, పాలిమేను శ్రీను, చామంతి మల్లేశ్వరరావు, తడిమట్ల శ్రీనివాస్, సూర్పని రామకృష్ణలతో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా చవితి ఏర్పాట్లు



వినాయక బొమ్మను కొనుగోలు చేస్తున్న నిర్వాహకులు

పెంటపాడు: గణేష్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామ గ్రామాన గణేష్ మందిరాలు ముస్తాబవుతున్నాయి. కమిటీ సభ్యులు వాటిని ఆకర్షణీయంగా అలంకరిస్తున్నారు. ఈనెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, గణనాధుల భారీ విగ్రహాలు వాటిలో కొలువు తీరనున్నాయి. పలు గ్రామాల్లో వినాయక ప్రతిమలు నిలబెట్టేందుకు వీలుగా చలువ పందిళ్లు వేశారు. ప్రత్తిపాడులో ఔత్సాహికులు స్థానిక శివాలయం వద్ద ఉచితంగా మట్టి ప్రతిమలను సోమవారం పంపిణీ చేసారు. మండలంలో పలు గ్రామాల కూడళ్లలో వినాయకుని ప్రతిమలు ఏర్పాటు కోసం విద్యుత్ లైట్లు వెలిగించారు. అలంపురం, ప్రత్తిపాడు, పెంటపాడు గ్రామాల్లో భారీగా ఉత్సవాలు చేసేందుకు యువత భారీ ఏర్పాట్లు చేసారు.



కాగులంపాడు వద్ద చవితి పందిరి ఏర్పాట్లు

గూడెంలో ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సోమవారం నుంచే వినాయక చవితి ఉత్సవాలు ఉత్సాహంగా వాడవాడల ప్రారంభమయ్యాయి. పెద్దలు, పిల్లలు, మహిళలు చలువ పందిర్లు వేయడం, లైటింగ్ ఏర్పాట్లు చేశారు. నచ్చిన వినాయక ప్రతిమలను కొనుగోలు చేసి స్వామి వార్లను పట్టణంలో ఊరేగిస్తూ ఒక రోజు ముందే భక్తి శ్రద్ధలతో ఆయా సెంటర్లకు తీసుకువచ్చారు. వినాయక ప్రతిమలను ఊరేగింపుగా తీసుకురావడంతో సోమవారం నుంచి పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది.

సజ్జాపురం.. సమస్యలతో సతమతం

- గతంలో పచ్చని వాతావరణం.. నేడు రోడ్లపైనే చెత్తలు
- రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు
- మురుగుమేటవేసిన డ్రెయినేజీలు



తణుకు సజ్జాపురంలో రోడ్డుపై చెత్త పాయింట్‌లో పేరుకున్న చెత్త





తణుకు సజ్జాపురం జాతీయరహదారి సర్వీసు రోడ్డు ప్రాంతంలో రోడ్డుపైనే పెరిగిన పిచ్చిమొక్కలు, తణుకు సజ్జాపురం వానపల్లి వారి వీధిలో డ్రెయినేజీ దుస్థితి

తణుకు అర్బన్: సజ్జాపురం ఒకప్పుడు మినీ జూబ్లీ హిల్స్ మాదిరిగా వర్ణించేంతగా సుందరంగా ఉండే ప్రాంతంగా పేరుగాంచింది. సీసీ రోడ్లు, పచ్చని చెట్లతో ఎంతో సుభిక్షంగా ఉండే సజ్జాపుర ప్రాంతం నేడు పారిశుద్ధ్య సమస్యలతో కునారిల్లుతోందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. ఏ రోడ్డు చూసినా ఇరువైపులా పచ్చగా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, మురుగుపారని డ్రెయినేజీలతో పాటు రోడ్లపైనే చెత్త కుప్పలుగా మేటవేసిన దుస్థితి నెలకొంది. పారిశుద్ధ్య సిబ్బంది ఇంటి నుంచి సేకరించిన చెత్తను ఒకచోట చెత్త పాయింట్‌లో వేయాల్సిన దుస్థితి రావడంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన, దుర్గంధంతో నిండిపోతుందని స్థానికులు అల్లాడిపోతున్నారు. గతంలో ఇలా ఎన్నడూ రోడ్లపై చెత్తకుప్పలు కనిపించిన దాఖలాలు లేవంటూ ప్రజానీకం ముక్కున వేలేసుకుంటున్నారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరగడంతో విషసర్పాలు సైతం రోడ్డు దాటుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై పర్యవేక్షణ ఏది

పారిశుద్ధ్య నిర్వహణపై మునిసిపల్ పారిశుద్ధ్య విభాగ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడం కారణంగా రోడ్లపై చెత్త మేటవేస్తుందని ప్రజానీకం ఆరోపిస్తున్నారు. ఇంటినుంచి సేకరించిన చెత్త నేరుగా కంపోస్టు యార్డుకు తరలించే పరిస్థితులు లేకపోవడంతో కార్మికులు చెత్తపాయింట్‌లో చెత్త వేయడం ట్రాక్టరు వచ్చి తీసుకువెళ్లే వరకు ఆ ప్రాంతంలో చెత్త నిల్వ ఉండడంతో ఇళ్లలో దుర్వాసనతో ఉండలేకపోతున్నామని బాధితులు వాపోతున్నారు. సజ్జాపుర ప్రాంతంలో కొన్ని ప్రాంతాల్లో చెత్త పాయింట్‌లు ఏర్పాటుచేసి చెత్తను నిల్వ ఉంచుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుబయట చెత్త వేయవద్దని చెబుతున్న అధికారులు ఈ చెత్త పాయింట్‌లపై ఏం చెబుతారంటూ ప్రజానీకం సైతం నిలదీసే పరిస్థితి నెలకొంది. తణుకు పట్టణంలో సజ్జాపురం అత్యంత ఖరీదైన ప్రాంతంగాగా, ప్రశాంతతకు మారుపేరుగా ఎంతో సుందరంగా ఉండే ప్రాంతం నేడు పారిశుద్ధ్య సమస్యలతో ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుగొలను గురుకుల విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు



ఆరుగొలను గురుకులంలో ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుగొలను గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, వాతావరణంలో వచ్చిన మార్పులతో వచ్చే వ్యాధులపై డాక్టర్ టి.సింధు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సబ్ యూనిట్ అధికారి సత్యప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీ.మణి, ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): నేత్రదానంపై అవగాహన అవసరమని పలువురు వక్తలు తెలిపారు. సక్షమ్ జిల్లా ఆధ్వర్యంలో నేత్రదాన పక్షోత్సవ అవగాహన సదస్సులు సోమవారం పట్టణంలోని వాసవి డిగ్రీ కళాశాల, మహిళా కళాశాలలో నిర్వహించారు. నేత్రదాన అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాజు, జిల్లా అధ్యక్షుడు కేఎస్‌కేఎస్ అప్పారావు, కోశాధికారి దుర్గారావు, సంయుక్త కార్యదర్శి విజయలక్ష్మి, సభ్యులు సుధీర్, బాజీ, కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

29న తణుకులో 2కే రన్

తణుకు అర్బన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీ ఉదయం 6 గంటలకు తణుకు శ్రీ చిట్టూరి ఇంద్రయ్య కళాశాల ప్రాంతంలో 2 కె రన్ నిర్వహిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. అండర్ 12, 14, 17, 20, 20 ప్లస్ బాలురు, బాలికల విభాగాల్లో నిర్వహించే ఈ రన్‌లో వయసు కేటగిరిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 96762 51733 నంబరులో సంప్రదించాలని కోరారు.